# మనసుదాచే నిజం !

సిటీలో మాకాలనీ అనుకునే ఒక చెరువుంది! చెరువు కట్ట మీది నుంచే సిటీబస్‌లు వెడుతుంటయ్! కాలనీ వాసులంతా కట్టదాకా నడచి వస్తేగాని బస్ ప్రయాణం వీలుండదు.

ఎన్నో ఏళ్ల క్రితం మహారాజులు తవ్వించిన చెరువు అది. ఇప్పుడు పూడ్చటమే గాని తవ్వించటం కొత్తవి ఏర్పరచటం లేదుకదా? నేటి వరకూ మిగిలివున్న చెరువులే ప్రజానీకానికి దిక్కు!

ఆఫ్ కోర్స్ కాలక్రమేణా సగం చెరువు కబ్జాకు గురై.. ఇళ్లు అనధికారికంగా వెలిసాయి. చెరువు చిక్కి చిన్నదైంది.

ఒకప్పుడు అన్ని వినియోగాలకు చెరువే ప్రజలకు ఆధారం! నేడేమో.. చెత్త చెదారం.. ప్లాస్టిక్ సంచులు.. 'గార్బేజ్' మూటలు అందులోకి ప్రజలు విసిరేసి పుణ్యం కట్టుకుంటూంటారు. ఎవ్వరినీ ఏమీ అనలేని దుస్థితి.నా బోటి సీనియర్ సిటిజన్ అదేమిటని నోరు తెరచి ప్రశ్నిస్తే... పెద్దచిన్న తేడా మరిచి తగాదాకు దిగుతారు. అంచేత ప్రజల అలవాటు మార్చటం ఎవరి తరమూ కాదు.

వినాయక చతుర్థి నాడు నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుంది. పత్రితో సహా స్వామి వారి ప్రతిమలను చెరువులో పడేస్తారు. దీనికి తోడు చెరువు నిండా గుర్రపుడెక్క తేలియాడుతూండటం మరో విశేషం!

పరిశుభ్రత విషయం ఎవ్వరికీ అక్కర్లేదు. పట్టించుకోరు!!

వినాయకుడికి నోరు లేదు గానీ.. వుండి వుంటే భక్తులారా నన్నీ కంపుకొట్టే మురికి నీటిలో నిమజ్జనం చేయకండీ అంటూలబ లబా మొత్తుకునేవాడు. మన కోసం ఆ దేవుడు అన్నీ భరిస్తాడు. ఏం చేస్తాడు మరి. భక్తి కదా!

ఈ విధమైన తంతు మార్చద్దని నాయకులు గొంతు చించుకుంటారు. వారి నినాదాలు ఆగడాలు భరిస్తూ ప్రభుత్వం నోరు మూసుకోక తప్పదు. వీల్లేదంటే ప్రచ్ఛన్నయుద్ధమే! సరే! ఎవరి కర్మ వారిది.

ఏం బుద్ధి పుట్టిందో ఏమో... ఇటీవల చెరువు పక్కనే కోటి రూపాయల ఖర్చుతో అధునాతన మైనపార్కు వెలిసింది. చెరువు కట్టంతా బాగు చేసి బండలు పరిచి రెయిలింగ్ వేసి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసారు. దీపాలంకరణతో రాత్రి సమయంలో చూడ ముచ్చటగా

వుంటుంది.

వచ్చిన చిక్కల్లా ఎక్కడంటే... సిమెంట్ బెంచీలను ప్రేయసీ ప్రియులు... హాకర్లు.. రౌడీలు... దగుల్బాజీలు... దొంగలు గంటల తరబడి ఆక్రమించుకుని ఎంతకీ కదలరు. వెలుతురులో వాళ్ల ఆగడాలు సాగవని... కావాలనే బల్బులు పగుల కొట్టి చీకటి చేస్తారు.

ఇందరి మధ్య నా వంటివాడు కాస్సేపు కుర్చుందా మనుకున్నా చోటుండదు. అందు వలన... వాకింగ్ పూర్తి చేసుకున్న తర్వాత నేరుగా ఇల్లు చేరుకోవటమే శ్రేయోదాయక మన్పిస్తుంది.

పాట్నా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చేసిన నేను రిటైరైన తర్వాత హైదరాబాద్ చేరుకున్నాను. నా కున్న స్థలంలో ఓ బిల్డరు అపార్ట్‌మెంట్ కట్టించి ఓ రెండు నా స్వంతానికీ.. కొంత క్యాషూ ఇస్తానంటే యస్సనేశాను.

ఎందోకో ఆ కాలనీ వదిలి మరో చోట స్థిరపడేటందుకు నా మనసు వప్పుకోలేదు. ఆ స్థలం మా తాతల నుండి నాకు సంక్రమించింది కావటంతో అభిమానం!

నేను పి.జి. చేసిన రోజుల్లో హైదరాబాదా ఇది? ఇన్నేళ్లల్లో ఎంత మార్పు? ఎక్కడ చూద్దామన్నా జనసందోహంతో నగరం కిటకిటలాడుతోంది. ఇసుక వేస్తే రాలనంతగ ఇళ్లు! ఇళ్లా? కావవి... కాంక్రీట్ కట్టడాలు.. అమెరికాను పోలి వున్నాయ్.

రద్దీ పెరిగింది....కాని.. రోడ్లు అదే! పేవ్ మెంట్లని సైతం వదల్లేదు. ఆక్రమణలకు గురైనయ్. అంతటా పొల్యూషనే! దుమ్ము ధూళితో వాతావరణం నిండిపోయి పీల్చటానికి స్వచ్ఛమైన ఆక్సిజన్ కరవైందన్పిస్తోంది.

మసక బారిన చార్మినార్... శిథిలమైన గోల్కొండ ఖిల్లా అలనాటి వైభవానికి తీపి గుర్తులుగా మిగిలినయ్.

దుర్గంధాన్ని వెదజల్లుతూన్న మూసీ... ఒక నాటి అత్తరు వాసనలను మురిపిస్తోంది. (ఇది వెటకారం!)

మలినమైన హుస్సేన్ సాగర్ నీటి మధ్యలో దిగాలుగా వంటరి తనంతో విలవిల్లాడుతున్న తథాగతుడుని చూస్తూంటే అయ్యో పాపం అన్పించక మానదు.

ఇరవై నాలుగు గంటలూ వాహనాల రొద..ట్రాఫిక్‌జామ్స్‌తో విసిగిపోయే వాహన చోదకులు... వీధికి రెండేసి బ్రాందీ షాపులు... ప్రతి సందులోనూ... బిర్యానీ హోటళ్లు... ఎటు చూచినా ఆకాశమంత ఎత్తున హోర్డింగులు...ఎప్పుడు కూలుతాయో వూహించలేని నాసిరకం ఫ్లై ఓవర్లు... దొంగలు...పిక్‌పాకెటర్స్...ఛైన్ స్నాచర్స్‌కి...హంతకులకు నిలయమైనందుకు నా మనసు ఆవేదనకి గురౌతూవుంటుంది.

ఇంటికి తాళం పెట్టాలంటే భయం! పట్టపగలే తాళాలు పగలకొట్టి దోచుకోవటాలు పెరగటం దురదృష్టం!

భయం గుప్పిట్లో ఆడవాళ్లు... పిల్లా పెద్ద... అందరూ బతుకుతున్న భయానక క్షణాలు గుర్తొస్తే గుండె చెరువౌతుంది.

మా కాలనీలో వృద్ధుల సంఖ్య ఎక్కువే! ఒక్కమా కాలనీ అన్న మాటేమిటీ...! దేశంలో ..యావత్ ప్రపంచంలోకెల్లా వృద్ధుల సంఖ్య ఎక్కువ శాతం వుందని గణాంకాలు తెలీజేస్తున్నాయ్.

కాలగమనంలో మార్పులు తప్పవు! వృద్ధాప్యమూ అంతే...

నా మటుక్కు నేను వంటరి వాడినే అయినా వృద్ధాశ్రమంలో వుండేటందుకు ఇష్టపడను. ఇప్పటికీ స్వయం పాకమే! శక్తి సన్నగిల్లిన నాడు వంట మనిషి సంగతి ఆలోచిస్తాను. పని మనిషి మాత్రం తప్పనిసరి.

నాకు సంతోషమే సగం బలం! సినీమాలకీ, క్లబ్‌కీ వెళ్లే అలవాటు లేదు. నో స్మోకింగ్...నో డ్రింక్స్!

ఆహ్వానం మేరకు సాహితీ సమావేశాలకు అతిథిగానో.. అధ్యక్షుడిగానో... ఉపన్యాసకుడిగానో.... వెళ్లటం తప్పనిసరి.

సాహిత్యం నా ఆరోప్రాణం!

లెక్చరర్‌పోస్టులో జాయినైన నేను అంచెలంచెలుగా ఎదిగి వైస్‌ఛాన్సలర్ అయ్యాను. నా ఎదుగుదలకు నా స్వయంకృషి.. టాలెంటే కారణం.

ఇక్కడ పుట్టి.. చదివి... ఎక్కడో వుద్యోగం చేసి... జీవితసారాన్ని వంట బట్టించుకుని.. తిరిగి స్వస్థలమైన హైదరాబాద్ వచ్చి స్థిరపడటం... భూమి గుండ్రమనే సిద్ధాంతాన్ని నిరూపించటమే అన్పిస్తుంది నామట్టుకునాకు.

నేను నలభై యేళ్లు నార్త్‌లో ఉద్యోగరీత్యా వుండిపోయినా... తెలుగుపట్లనాకుండే అభిమానం మమకారం అంతా ఇంతా కాదు.

కవితలు.. కథలు... నవలలు... వ్యాసాలు... విమర్శలు.... ఇంకా అనేక ప్రక్రియల్లో తలదూర్చినవాడిని! పేరు ప్రఖ్యాతులతో పాటు... పురస్కారాలు... అవార్డులు... గౌరవ డాక్టరేట్లూ పొందాను.. అదినా అదృష్టం!

★★★★★

సాయం సంధ్యా సమయం!.....

హేండ్‌స్టిక్ పుచ్చుకుని సరూర్‌నగర్ చెరువు కట్టమీద ఠీవిగా ఈవినింగ్ వాక్ చేస్తూ.... సూర్యాస్తమయ సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ... ప్రకృతి రమణీయతకు తనువు మనసు పులకిస్తున్న క్షణాల్లో... నాలోనేను నవ్వుకుంటూ ఒక చోట నిల్చున్నాను.

నా వేపు ఒక వ్యక్తి రావటం గమనించాను. అతనెవరైందీ పోల్చుకోలేకపోయాను. ఈ మధ్య జ్ఞాపక శక్తి సన్నగిల్లింది.

అతను దగ్గరైనాడన్న మాటే గానీ.. అతగాడి పేరు గుర్తుకురాక ఇబ్బందిపడుతూంటే... నేను సార్ స్టోరీరైటర్ కీర్తిని... మిమ్మల్ని ఎప్పుడో ... తెలుగు రచయితల సభల్లో చూసాను. మళ్లీ ఇదే కల్సుకోవటం..అని చెప్పటంతో నాలోని డౌట్ క్లియరైపోయింది.

'మిమ్మల్ని దూరం నుంచి గుర్తించి పోల్చుకోలేక పోయాను. వి.సి. గారూ...' మళ్లీ కీర్తి అన్నాడు.

'ఇంకా ఆపదవితో పిలవకండి! నేను రిటైరై ఇక్కడే సెటిలయ్యాను. అదిగో కన్పించే ఆ కాలనీలో వుంటున్నాను. నన్ను గుర్తించలేక పోవటానికి కారణం లేక పోలేదు. పళ్లూడిపోయి దవడలు లోపలికి తోసుకుపోయ్‌నయ్! మల్లీశ్వరి సినిమాలో అలనాటి హీరో ఎన్టీఆర్ జుట్టులా వుండే నాగిరజాల జుట్టు రాలిపోయి బట్టతలైంది! పైగా... వృద్ధాప్యం సంతరించుకున్నట్టు... అనుక్షణం గుర్తు చేసే చేతిలో కర్రొకటి... వయస్సు మీద పడినా ఖంగ్‌న మ్రోగే స్వరంతో జవాబిచ్చాడు.

గభాలున కీర్తి వంగి పబ్లిక్ రోడ్డులో నాకు పాదాభి వందనం చేయటం కొంచెం ఇబ్బంది గా ఫీలయ్యాను.

'ఆ మధ్య ఎప్పుడో మీరు పంపిన మీ కథల సంపుటి పుస్తకాన్ని చదివి... మీకు అభిప్రాయం వ్రాసానుకూడా కదూ?-గతాన్ని ఆకళింపు చేసుకుంటూ అన్నాను.'

'పుస్తకం ఆసాంతం చదివి నిర్మొహమాటంగా నిస్కర్షగ, అభిప్రాయం తెలీచేసినందుకు నా ధన్యవాదాలు సార్...' మురిసి పోతూ మాట్లాడాడు కీర్తి.'

'ఈ మధ్య ఎక్కడా కన్పించటం లేదు. కథలు రాయటం మానేశావా కీర్తి?'

'అవును సార్! రాయాలనే వుత్సాహం చచ్చి పోయింది. ఎందుకు రాయాలనే వైరాగ్యం నాలో చోటు చేసుకుంది. అందుకే నాలోని ఏమోషన్స్ చప్పచల్లారినయ్ సార్!'

'నిరుత్సాహ పడకు' ఇలాంటప్పుడే రచనా వ్యాసాంగం మంచి టానిక్‌లా పనిచేస్తుంది. శరీరానికీ మనసుకీ హాయినిస్తుంది! నన్ను చూడు.. నిత్యయవ్వనుడ్ని. నాకు సమస్య ల్లేవు... వాటితో నాకు పన్లేదు... హేపీగా.. ప్రశాంతంగా... జీవించటం నేర్చుకున్నాను. అదే జీవితం నేర్పిన పాఠం!

'నా గురంచి వదిలేయండి సార్! మీ మిసెస్ పిల్లలూ కులాసానా! మీకు ముగ్గురూ మగపిల్లలే అన్చెప్పారు. ఎప్పుడో... అందరూ సెటిలై నట్టేనా?... అప్యాయత పుట్టి పడేలా ప్రశ్నించాడు కీర్తి.

'ఆల్‌త్రీ సెటిల్డ్! పెద్దవాడు అమెరికాలో స్థిరపడ్డాడు. వాడొక కంప్యూటర్ సంస్థకి యజమాని. రెండో వాడు ఆస్ట్రేలియాలో డాక్టరు! మూడోవాడు ఆఖరివాడు ప్రస్తుతం సింగపూర్లో ఓ పెద్ద హోటల్ నడుపుతున్నాడు...

తడుముకోకుండా ఎలిమెంటరీ క్లాసులో పిల్లాడులా గడగడా పద్యం అప్పగించినట్టు కీర్తి ప్రశ్నకు జవాబిచ్చాను.

'మనుషుల్లో వూసరవెల్లులుంటారుసార్-కానీ రచయితలం మనం అలావుండలేం...! వోదిగి పక్కగా నిలబడి మాట్లాడేడు కీర్తి.

నా జవాబు అతనికెంతో ఆనందాన్ని తృప్తినీ ఇచ్చివుండాలి! అందుకే ఆ విధంగా మాట్లాడాడు అనుకున్నాను.

'మళ్లీ ఎప్పుడైనా మరోసారి కల్సుకుందాం కీర్తి' అంటూ ముందుకు సాగాను.

అతను చాలాసేపు నావైపే చూస్తుండటం గమనించాను.

నాకే సిగ్గన్పించి మళ్లీ తలెత్తి చూడలేక పోయాను.మనిషనే ప్రతివాడూ పెద్ద అబద్దాలకోరు సుమా! తెల్లారింది మొదలు చీకటి పడి నిద్రలోకి జారిపోయే వరకు ఒక్కో మనిషీ ఎన్నెన్ని అబద్ధాలు చెప్తాడో?... చెప్తూ బ్రతుకుతాడో కంప్యూటరైజ్ చేస్తే... ఇంకేముంది? కొంపలు కొల్లేరవుతాయ్.... ప్రపంచం తల్లకిందులౌతుంది.

నీతి.. న్యాయం.. నిజాయితీ వంటివి. అత్యంత అద్భుతమైన అందమైన పదాలు! వీటిని డిక్షనరీలోంచి తొలగించాలి.

ప్రతీ మనిషి అబద్ధాల పుట్ట! ఎవడి మటుక్కువాడు తానొక హరిశ్చంద్రుడనీ... ధర్మరాజనీ అనుకుంటాడు.. లేకపోతే బ్రతకలేడు.

మాంసం తింటూనే... ప్యూర్ విజిటేరియన్ అంటాడు..అన్నీ మోసపూరిత మనసులే! చేసే దొకటి చెప్పేది వేరొకటి! భస్! ఈ ప్రపంచమే అంత!

మైండ్ రీడింగ్ విద్య మనుషులకు తెలిసి వుంటే.. ఒకరినొకరు చంపుకు చస్తారు. ఏ ఒక్కరూ ఒక్క నిముషం పాటు బ్రతకలేరు. మనసుని చదవగల యంత్రాలను ఈ మానవుడుఎప్పటికీ కనిపెట్టలేడు. కాదు.. కనిపెట్టకూడదు.... కనిపెడితే మరు క్షణంలో మానవకోటి భూమ్మీద నాశనమౌతుంది. అలాంటి మెషీన్ కనిపెట్టినవాడిని నిర్దాక్షిణ్యంగా

చంపేస్తుందీ సొసైటీ!

★★★★★

నా బాధలు ఎవరితోనూ చెప్పుకోలేను. పైకి నవ్వు ముఖాన పులుముకుని మాట్లాడుతున్నా... నా మనసులో అగ్నిగోళాలు నిత్యమూ బద్దలవుతూనే వుంటాయ్!

నేను కీర్తితో చెప్పిన వాటిల్లో ఏ ఒక్కటీ నిజం కాదు. అన్నీ అబద్ధాలే చెప్పాను. ఆ విధంగాచెప్పకపోతే నేనీ సొసైటీలో హేపీగా పెద్దమనిషిలా జీవించలేను చెలామణికాలేను.

ఒక్క కీర్తితోనే కాదు అనేక మందితో అనేక చోట్ల అనేక సందర్భాల్లో అబద్ధాలు చెప్తూవస్తున్నాను. ఎదుటి వారిని నమ్మిస్తున్నాను.

ఆ విధంగా ప్రవర్తించటంలో నా కొక తృప్తి కన్పిస్తుంది. హృదయ భారం తగ్గినట్టు ఫీలవుతాను.

నిజానికి నా భార్య చనిపోలేదు. కానీ... చనిపోయినట్టుగా నాచుట్టూ వుండే వారిని అయిన వారినీ నమ్మించాను. కట్టుకథ అల్లాను.

ముగ్గురు పిల్లల భవిష్యత్‌ను నాకు అప్పగించి... వాళ్లని నా చేతుల్లోపెట్టి...ఆమె నా కారు డ్రైవర్‌తో లేచిపోయిందనే నిజం చెప్తే? నా పరువు ప్రతిష్ఠలేమౌతాయ్! మంటగలిసిపోవూ?

నా భార్య చేసింది నీచమైన పనిఅని నాకు తెలుసు. అయినా అందమైన అబద్దాన్ని నిజానికి పులిమి ఆమె చనిపోయిందని ప్రచారం చేసాను. నన్ను నేను అసహ్యించుకుంటూ... నాకు నేను నచ్చ చెప్పుకుంటూ.. గుండె బరువు దించుకున్నట్టు నటిస్తూ బ్రతకటానికి అలవాటుపడ్డాను.

నా పిల్లల విషయంలోనూ అంతే జరిగింది. వారు శుంఠలు అప్రయోజకులుగా తయారై ఇల్లు విడిచి వెళ్లి పోయినా... నా స్టేటస్ దెబ్బతినకుండావుండాలనే ఆపేక్షతో తీయని అబద్దాన్ని సృష్టించి చెప్పాల్సిన ఆగత్యం ఏర్పడ్డది!

నా బాధలు ఎవరికి చెప్పుకోను? ఏమని చెప్పను? తల్లి గుణాలనే పుణికి పుచ్చుకున్నారో ఏమో! చదువు సంధ్యలు అబ్బక దేశాలు పట్టి పోయారు ముగ్గురూ!

పెద్దవాడు జల్సాలకు అలవాటుపడి...దొంగతనాలు ప్రారంభించాడు.పిక్ పాకెటింగ్.. చైన్ స్నాచింగ్ వంటివాటితో అవసరాలు తీర్చుకుంటూ పట్టుబడినప్పుడు జైలు కెళ్లిరావటం వాడికి అలవాటైంది. ఇంటి ముఖం చూడటం మానేశాడు.

రెండవ వాడు సినిమా హీరో కావాలనే దురాశతో ముంబైచెక్కేసాడు. ఎప్పుడైనా డబ్బుకోసం

వుత్తరాలు రాసేవాడు. కొన్నాళ్లు పోయాక అదీలేదు.

మూడవ వాడి సంగతి సరేసరి. ఇంజనీరింగ్ చదువుతూ వున్నట్టుండి రాత్రికి రాత్రి ఇంటి నుండి మాయమైనాడు. తర్వాత తెల్సింది.... విప్లవం పట్ల ఆకర్షితుడై అడవుల పాలైనాడని. నారిటైర్మెంట్ మరో ఏడాది వుందనగా వీడు ఎన్‌కౌంటర్లో మరణించాడనే వార్త తెల్సుకుని దిగ్భ్రాంతికి లోనయ్యాను. నిండుజీవితాన్ని చేజేతులా నాశనం చేసుకున్నందుకు మూడవవాడిని చూస్తే అసహ్యం... జాలీ వేసింది.

ముగ్గురు కొడుకులు నాకు దక్కకుండా పోయారు. కట్టుకున్న భార్య ఆ తీరు... ముగ్గురు సంతానం ఈ తీరు!

ఈ బాధ ఎవరితో ఏమని చెప్పుకోను? అందుకే అందమైన అబద్ధాలు సృష్టించి చెప్పటానికి అలవాటు పడ్డాను. నిజాన్ని మనసులోనే సమాధి చేసాను.

కష్టాలను దిగమింగుతూ... అన్నీ మర్చిపోయిన వాడిలా నటిస్తూ ఈ సొసైటీలో నా స్టేటస్ తగ్గకుండా బ్రతుకీడుస్తున్న దౌర్భాగ్యుడిని నేను.

నా మనసు నిజాలను కావాలనే దాస్తూ! నన్ను అనుక్షణం రక్షిస్తోంది!! థాంక్ గాడ్!!

-:(సమాప్తం):-